# కాంగ్రెస్ కడుపు మంట



- సాగుకు 3 గంటల కరెంటే చాలంటూ ప్రకటనలు
- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అహంకారపు మాటలు
- ఎన్నికల వేళ రైతులను కించపర్చేలా వ్యాఖ్యలు
- మాటలపై రైతుల్లో కట్టలుతెంచుకున్న ఆగ్రహం
- 10హెచ్‌పీ బోరు మోటర్లు బిగిస్తే ట్రాన్స్‌ఫార్మర్లు
- కాలిపోతాయంటున్న సన్న, చిన్నకారు కర్షకులు
- విద్యుత్ కష్టాలు తెచ్చేందుకే అంటూ నిలదీత
- తిప్పకొట్టాలంటున్న కర్ణాటక రాష్ట్ర రైతులు
- కాంగ్రెస్ పాలనొస్తే ఘోస తప్పదని హెచ్చరిక

## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

### 10హెచ్‌పీ మోటార్‌తో సాగు అసాధ్యం



నేను 20ఏండ్లుగా బోర్ మోటర్లును రిపేరింగ్ చేస్తున్న. నేను కూడా వ్యవసాయ కుటుంబంలో పుట్టిన. ఇప్పటి వ రకు 10 హెచ్‌పీ మోటర్లు సన్నకారు రైతులు ఎవరూ వాడ లేదు. 10 హెచ్‌పీ మోటర్‌తో ఆర్థిక ఇబ్బంది మరి ఎక్కువనే చెప్పాలి. ప్రస్తుతం రైతులందరూ 5హెచ్‌పీ మోటర్‌లు వాడుతున్నారు. ఇద్దరో, ముగ్గురో 7.5 హెచ్‌పీ మోటర్లును ఉపయోగిస్తున్నారు. మూడు గంటల కరెంట్‌కు 10 హెచ్‌పీ పెట్టుకున్న దండగే. అందరూ ఒకేసారి మోటర్లు వేస్తే ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడ్ పడి పేలిపోతాయి. ఇప్పుడు ఉన్న కరెంట్ ప్రతి ఒక్క రైతుకు కరెంట్ కోతలు లేకుండా ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగుతున్నాయి. గతంలో లోవోల్టేజీ సమస్య ఎక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు అలాంటి సమస్యలు లేవు. నాకు ఉన్న అనుభవంతో చెప్తున్న 3గంటల కరెంట్‌కు ఏమాత్రం ఉపయోగం లేదు. గత కాంగ్రెస్ హయాంలో లోవోల్టేజీ సమస్యల వల్ల రైతులు నిద్రలేని రాత్రులు గడిపిన దినాలు లెక్కలేనివి. ఉమ్మడి పాలమూరు జిల్లాల్లో సాగునీరు లేక ఎంతో మంది రైతులు మృతి చెందడం చూశాం. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంక సాగునీటికి కానీ రైతులకు ఇచ్చే కరెంట్‌కు ఎలాంటి ఢోకా లేదని రైతులు ఉంటున్నారు.

**- రాజు, మోటర్ మెకానిక్, వనపర్తి జిల్లా ( రాజనగరం)**

### మూడు గంటల కరెంట్‌తో మూడు మడులు కష్టమే..



మూడు గంటల కరెంట్‌తో మూడు మడులు కూడా నీరు పారదు. మూడు గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్లతో ఆయనను వచ్చి పొలానికి నీళ్లు పారబెట్టమను. వ్యవసాయం గురించి తెలియని వాళ్లు ఇట్ల మాట్లాడుతారు. ఇప్పటి వరకు ప్రతి రైతుకు మూడు, ఐదు, ఏడు హెచ్‌పీ మోటార్లే ఎంతో సహకరిస్తున్నాయి. 10 హెచ్‌పీ గురించి వినడమే ఇది మొదటి సారి. నేను 46ఏండ్లుగా వ్యవసాయం చేస్తున్నాను. బావిలో నుంచి మోట గొట్టిన. ఆయిల్ ఇంజిన్‌తో నీళ్లు పారబెట్టిన. 5హెచ్‌పీ మోటర్ 20 ఎకరాలకైనా సరిపోతుంది. ఒక వేళ 10 హెచ్‌పీకి మారాలంటే పైపు లైన్లు మార్చుకోవాలి, కొత్త మోటరు తెచ్చుకోవాలి. రైతుకు ఎంతో ఆర్థిక భారం పడుతుంది. ఇప్పుడిస్తున్న 24గంటల్లో అప్పుడప్పుడు అంతరాయం కల్గినా..రైతుకు అవసరమయ్యే 8గంటల కరెంట్‌కు ఢోకా లేదు. ఈ పరిస్థితుల్లో కేవలం మూడు గంటలే కరెంట్ ఇస్తామంటే వ్యవసాయం సాగడం కష్టమే. ప్రస్తుతం రైతు స్వేచ్ఛగా ఎప్పుడంటే అప్పుడు నీరు పారబెట్టుకొనే అవకాశముంది. కానీ మూడు గంటలే ఇస్తామంటే రైతుకు పాత కష్టాలు మళ్లీ తప్పవు. కరెంట్ ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతదో తెలియక కావలి కాయాల్సి వస్తుంది. కాంగ్రెస్ చేసే పనులే ఇటువంటివి. అందుకే ఆ పార్టీని ఎవరూ నమ్మరు, దానికి ఎవరూ ఓటేయరు.

**– వల్లపురెడ్డి, మహేశ్వరరెడ్డి, రైతు, పెబ్బేరు**

### ఎవుసం బంద్ చేసుకొని కూసోవాలె..



కాంగ్రెసోళ్లు వస్తే ఎవుసం బంద్ చేసుకొని కూసోవాలె.. మూడు గంటల కరెంట్ ఏమిటికి సరిపోదు.. దానికంటే సేద్యం, గీద్యం అన్నీ బంద్ చేసుకొని ఉప్పరి పనికిపోవడం మేలు.. ఆ మూడు గంటలు కూడా ఏ టైమ్‌ల ఇస్తరో తెలియక పరేషాన్‌ల పడాలె. గతంల రాజశేఖర్‌రెడ్డి జమానాల 9 గంటల కరెంట్ రాత్రిపూట ఇస్తుంటేనే ఎప్పుడు పోతుండె, ఎప్పుడు వస్తుండెనో తెలియకుండె. దానిచ్చకి బాయికానే పండుకుంటుండ్రి రైతులు. రాత్రిపూట కరెంటుతోనే సేనుకు నీళు కట్టనింకె అర్ధరాత్రి పూట బాయికాడికి పోయి మా నాయిన సచ్చిపోయిండు. నిద్రలకెంచి లేచిపోయి మోటర్ ఎయ్యనింకె పోయి కరెంట్ షాక్ కొట్టి అన్నే సచ్చిపోయిండు. ఇప్పుడు మా నాయినను ఎవ్వరూ తీసుకొస్తారు. గీ రాత్రి పూట కరెంటు కాని, మూడు గంటల కరెంటు గానీ ఎవుసం చేసేటోళ్లకి తిప్పలే. ఎవుసానికి 24 గంటలు కరెంటు ఇస్తేనే మంచిది. ఎప్పుడు అవసరమున్నా అప్పుడు పగటిపూటనే పని చేసుకుంటారు. రాత్రుళ్లు ఏమైనా రిపేర్ అయ్యిందనుకో అది మంచిగ చేసుకునేలోపే మూడు గంటలు అయిపోతది. ఇంక నీళ్లెట్ల పారుతయి. సీఎం కేసీఆర్ సారు రైతుల కోసం మంచిగా ఆలోచించి 24 గంటలు ఉచితంగా ఇస్తున్నడు. అట్లే రైతుబంధు, రైతుబీమా, సబ్సిడీ ఎరువులు అన్నీ రైతుల మంచి కోసమే చేస్తుండు. ఇయ్యాల యాడ యాడికి పనులకు పోయినోళ్లు కూడా ఊర్లకి వచ్చి ఎవుసం చేసుకుంటుండ్రంటే కేసీఆర్ సార్ చల్లని చూపే. ఇప్పుడు గిట్ల మళ్ల కేసీఆర్ సారే సీఎం కావాలె.

**- విశ్వనాథ్‌రెడ్డి, జూరాల, ఆత్మకూరు**

### మూడు గంటల కరెంట్ ఇస్తే రైతుకు గోసనే..



నాకు కొంత భూమి ఉంది. 24 గంటల కరెంట్ ఉండడంతో ఎప్పుడైన వెళ్లి పొలానికి నీరు పెట్టుకుంటున్నాం. గతంలో కరెంట్ ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు ఉండదో పరిస్థితి ఉండేది. కరెంట్ కోసం రాత్రిళ్లు పడిగాపులు కాసి పంటలు తడుపుకునేవారం. కానీ సీఎం కేసీఆర్ అందిస్తున్న 24 గంటల కరెంట్ ఇవ్వడంతో ఇబ్బందులు తొలగాయి. గడిచిన పదేండ్ల నుంచి ఎలాంటి బాధలు లేకుండా సాఫీగా సేద్యం చేసుకుంటున్నాం. 10హెచ్‌పీ మోటర్లు వాడాల్సి అవసరం లేదు. అందరూ రైతులు 10 హెచ్‌పీ మోటర్ వినియోగిస్తే విద్యుత్ సమస్యలు ఏర్పడతాయి. అధిక లోడ్ వల్ల ట్రాన్స్‌ఫార్మర్ల కాలిపోయి అవకాశ లేకపోలేదు. కేసీఆర్ ఇస్తున్న 24 గంటల కరెంట్‌తోనే సాగు ముందుకు సాగుతది. రెండు, మూడు గంటల విద్యుత్ ఇస్తే రైతుకు గోసనే మిగులుగుతుంది.

**- రామస్వామి రైతు శ్రీరంగాపురం**

### నీళ్లేనప్పుడు 10 హెచ్‌పీ మోటర్లు ఎలా వాడాలి..



తాము వేసిన బోరు బావుల్లో సమృద్ధిగా నీరు లేనప్పుడు 10 హెచ్‌పీ మోటర్లు వేస్తే ఏమి ఉపయోగం ఉంటుంది. కాంగ్రెస్ వాళ్లు చెప్పినట్లు 10 హెచ్‌పీ మోటర్లు వాడితే ఉన్న అరకొర నీటిని ఊడ్చికోట్టేస్తుంది. దానికి కరెంట్ కూడా ఎక్కువ అవుతుంది. 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఇద్దరు, ముగ్గురికి కలిపి ఒకటి ఉంటుంది. 10 హెచ్‌పీ మోటర్లు వాడితే రెండు కంటే ఎక్కువ నడవవు. ఒక వేళ 10 హెచ్‌పీకి మారాలంటే పైపు లైన్లు మార్చుకోవాలి, కొత్త మోటరు తెచ్చుకోవాలి. రైతుకు ఎంతో ఆర్థిక భారం పడుతుంది. కాంగ్రెస్ వాళ్లు వ్యవసాయం చేసి ఉంటే వారికి రైతుల కష్టాలు, మోటర్ల గురించి తెలిసి ఉండేది. కనీసం కాప్దానం మీద సోయి లేకుండా మాట్లాడుతున్నారు. మూడు గంటలే ఇస్తామంటే రైతుకు పాత కష్టాలు మళ్లీ తప్పవు. కాప్దానం మీద సీఎం కేసీఆర్‌కు ఉన్న అవగాహన ఏ నాయకునికి లేదు.

**-కొమ్ము మన్నెం రైతు, దొడగుంటపల్లి**

### ఒక తరం మారినా కాంగ్రెస్ నాయకుల తీరు మారలే



దేశంలో ఎక్కువ పాలన చేసిన కాంగ్రెస్ నాయకులకు అధికారం దూరమై ఒక తరం మారిన ఇంకా బుద్ధి రాదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ రైతులకు 24గంటలు ఉచిత విద్యుత్ అందిస్తుండడంతో మాలాంటి చిన్న, సన్నకారు రైతులకు బావుల వద్ద రాత్రి పూట నిద్ర కాయడం తప్పింది. పాముల బాధలు లేకుండా ఉన్నంతలో వ్యవసాయం చేసుకొని సుఖంగా జీవిస్తున్నాం. ఇప్పుడు ఎన్నికల సమయంలో కాంగ్రెసోళ్లు అధికారం కోసం రైతులకు మూడు గంటల విద్యుత్ సరిపోతది అంటున్నారు. లేకపోతే 10 హెచ్‌పీ మోటర్ల పెట్టి వ్యవసాయం చేయాలని ఉచిత సలహాలు ఇస్తున్నారు. గత కాంగ్రెస్ హయాంలో లోవోల్టేజీ సమస్యల వల్ల రైతులు నిద్రలేని రాత్రులు గడిపిన దినాలు లెక్కలేనివి. మరోసారి మాలాంటి రైతులకు కాళరాత్రులను చూపెట్టెందుకు కాంగ్రెస్ నాయకుల ప్రయత్నాలు చేస్తున్నారు. వారి కల్లబొల్లి మాటలను ప్రజలు ఎవరూ నమ్మవద్దు.

**-మాల్లెల సత్యనారాయణ,**
**అమరచింత పట్టణం రైతు తెలంగాణ కళాకారుడు**

### 24 గంటల విద్యుత్ రైతులకు వరం



తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 24 గంటలకు కరెంట్ రైతు లకు చాలా ఉ పయోగపడుతుంది. గత ప్రభుత్వ హయాంలో కరెంట్ ఎప్పు డు వస్తుందో అర్థం కాక రాత్రి వేళలో నీళ్లు పా రించే వాళ్లం. ఇప్పుడు ఉన్న కరెంట్ ప్రతి ఒక్క రైతుకు కరెంట్ కోతలు లేకుండా ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగుతున్నాయి. గతంలో లో వోల్టేజీ సమస్య ఎక్కవగా ఉండేది. కానీ ఇప్పుడు అలాంటి సమస్యలు లేవు. నాకు ఉన్న అను భవం తో చెప్తున్న 3గంటల కరెంట్‌కు ఏమాత్రం ఉపయోగం లేదు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 24గంటల కరెంట్ వల్ల రాత్రిపూట నీళ్లు కట్టే బాధ తప్పింది. వ్యవసాయంపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తి సీఎం కేసీఆర్. వ్యవసాయానికి మూడు గంటలు కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ పార్టీ రైతులను ఓటు అడిగే హక్కు లేదు. గత కాంగ్రెస్ హయాంలో లోవోల్టేజీ సమస్యల వల్ల రైతులు నిద్రలేని రాత్రులు గడిపిన దినాలు లెక్కలేనివి.

**- ఆంజనేయులు , రైతు,కంబాళాపురం , శ్రీరంగాపురం,మండలం**

### పది హెచ్‌పీ మోటరు రైతన్నలకు భారమే



నేను 30ఏండ్లుగా వ్యవసాయ బావుల మోటార్లను రిపేరు చేస్తున్నాను. 24 గంటల కరెంట్‌కు ముందు పరిస్థితి దారుణంగా ఉండేది. కరెంట్ ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతదో తెలియక రైతులు నానా తిప్పలు పడేవారు. లో వోల్టేజీల సమస్య వల్ల ఎక్కువగా మోటార్లు కాలిపోయేవి. కాలిన మోటార్లను మర మ్మతుల కోసం నా దగ్గరికి వచ్చేవి. రైతులు తమ కష్టాలు చెప్పుకొని బాధ పడేవారు. తమ సంపాదన మోటార్ల రిపేరుకే సరిపోయేదని వారు వాపోయేవారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాట య్యాక 24గంటల పాటు కరెంట్ సరఫరా అవుతున్నది. అప్పట్లో నీళ్లు పారబెట్టేందుకు వెళ్లిన రైతులు ప్రమాదాల బారిన పడేవారు. ఇప్పుడు తమకు సమయం దొరికనప్పుడల్లా పొలం వద్దకెళ్లి మోటార్లు ఆన్ చేసుకుంటున్నారు. నాణ్యమైన కరెంట్ వల్ల మోటార్లు కాలిపోవడం కూడా బాగా తగ్గిపోయింది. 24గంటల కరెంట్‌తో 10హెచ్‌పీ మోటార్‌తో నీళ్లు పారబెట్టుకోవడం రైతులకు ఇబ్బందికరమే. దూరం ఎక్కువగా ఉండి..నీటి అవసరం ఎక్కువగా ఉన్న సందర్భాల్లోనే 10హెచ్‌పీ మోటార్ల అవసరం పడుతుంది. అదీగాక..10హెచ్‌పీ మోటార్లకు అవసరమయ్యే విద్యుత్ వ్యవస్థ ఇప్పుడు లేదు. ఆ మోటార్లు పెట్టుకోవాలంటే ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల సంఖ్య పెంచాల్సి ఉంటుంది. ఒక ట్రాన్స్‌ఫార్మర్‌కు రెండు మోటార్లే పరిమితమయ్యే అవకాశముంది. ప్రభుత్వానికే కాకుండా, రైతుకు కూడా ఆర్థికంగా భారం పడుతుంది.

**- మహేశ్, మోటర్ వైండింగ్ మెకానిక్, పెబ్బేరు**